క్లుప్తంగా

సీసీ రోడ్లకు శంకుస్థాపన



తిరువూరు రూరల్: గ్రామాల్లో అంతర్గత రహదార్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. పల్లె పండుగలో భాగంగా శనివారం తిరువూరు మండలం వావిలాల, రాజుగూడెం, పెద్దవరం, ఎర్రమాడు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఆరు రహదార్ల నిర్మాణానికి రూ.1.11 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు

పుల్లూరు(మైలవరం): మూగ జీవాలకు వ్యాధులు సంక్రమించకుండా తప్పని సరిగా నట్టల నివారణ మందు వేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ హనుమంతరావు అన్నారు. పుల్లూరు గ్రామంలోని పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో మేకలు, గొర్రెలకు శనివారం నట్టల నివారణ మందులు వేసి పశు పోషకులకు సూచనలు చేశారు.

సమస్యల పరిష్కారానికే సభలు

చాట్రాయి: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. శనివారం పోతనపల్లిలో నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ సభకు 30 దరఖాస్తులు వచ్చాయన్నారు. రీసర్వే డీటీ గీతా, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నూజివీడు: వ్యవసాయ రంగ సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు గాను ఈనెల 22న విజయవాడలో నిర్వహించనున్న జాతీయ రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో జాతీయ రైతు సదస్సు కరపత్రాలను శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి. రాజు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గంటా పాపారావు పాల్గొన్నారు.

పరిహారం కోసం ఆందోళన

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి ఇటీవల వచ్చిన వరద ప్రభావంతో ఇళ్లు నీట మునిగి సర్వం కోల్పోయిన బాధితులు నష్టపరిహారం చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, వివిధ గ్రామాల బాధితులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తిరువూరు: జన విజ్ఞాన వేదిక, జీబీఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరు నాగార్జున పాఠశాలలో మధుమేహ రోగులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని జేవీవీ పట్టణ శాఖ అధ్యక్షుడు పాపారావు తెలిపారు. తెల్లవారు ఝామున 5 నుంచి ఉదయం 11 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. బీపీ, షుగర్, ఫిట్స్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి

ఆగిరిపల్లి: మండలంలోని పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోగా ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2021 అక్టోబర్ నాటికి పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మహిళల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపూడికి చెందిన అహ్మద్, టి.వెంకటరమణ, కిశోర్ కలిసి జిల్లా కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 2022 సెప్టెంబర్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది వద్ద పలు దఫాలుగా రూ.1.10 కోట్లు వసూలు చేశారు. కోర్టులో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలు ఇచ్చారు. డబ్బులు తీసుకున్నాక ఆ ముగ్గురు వ్యక్తులు ఉద్యోగాలపై సరైన సమాధానం చెప్పకపోవడంతో బాధితురాలు లింగా నిర్మలాదేవి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

న్యాయం చేయాలి..

బాధితులు రామలక్ష్మి, నిర్మలాదేవి, వెంకటరమణ భవానీపురం 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాటాడారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తమను మోసం చేశారని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.



నూజివీడు మేజర్ కాలువ

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

- నియోజకవర్గంలో 70 చెరువులు, ఎన్నెస్పీ పరిధిలో 10 మైనర్, మేజర్ కాలువలు..
- తొలిదశలో సాగునీటి సంఘాలకు, రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఎన్నికలు
- ఓటరు జాబితాలపై అధికారుల కసరత్తు

నూజివీడు: నీటి పారుదల వ్యవస్థలో కీలకమైన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా సాగునీటి సంఘాల ఓటరు జాబితాలను సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నూజివీడు నియోజకవర్గంలో చెరువులకు, సప్లై ఛానల్స్‌కు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువలకు సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నారు. వీటన్నింటికీ నవంబరు 24 నాటికి కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 100 ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉన్న చెరువులకు మాత్రమే సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహిస్తారు. ఒక్కో చెరువుకు ఒక సాగునీటి సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. దీనిలో ఆరుగురు సభ్యులు ఉండగా, వారిని రైతులు ఎన్నుకుంటారు. వారిలో ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా సభ్యులు ఎన్నుకుంటారు. సాగునీటి సంఘాల ఎన్నికల తతంగాన్ని నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించనున్నారు. ఆయా నీటి సంఘాల పరిధిలో సర్వే నంబర్ల ప్రకారం రైతుల జాబితాను తయారు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది.



నూజివీడు పెద్ద చెరువు

నూజివీడు నియోజకవర్గంలో 70 చెరువులకు..

నియోజకవర్గంలో 70 చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నారు. చాట్రాయి మండలంలో 16 చెరువులతోపాటు 2 సప్లై ఛానల్స్‌కు సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాగార్జున సాగర్ కాలువలకు..

నియోజకవర్గంలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని మైనర్ కాలువలకు, మేజర్ కాలువలకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. ముసునూరు మండలంలో వేల్పుచర్ల, కాట్రేనిపాడు, ముసునూరు, చెక్కపల్లి, గుళ్లపూడి, లోపూడి, ఆగిరిపల్లి మండలంలో ఈదులగూడెం, బొద్దనపల్లి, ఈదర, నూజివీడు మండలంలో రామన్నగూడెం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తయిన తరువాత డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లకు ఎన్నికలు నిర్వహిస్తారు. తొలి దశలో సాగునీటి సంఘాల ఎన్నికలు, రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మూడో దశలో డీసీ కమిటీల అధ్యక్షులు, సభ్యులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, డైరెక్టర్లను ఎన్నుకుంటారు.

నూజివీడు నియోజకవర్గంలోని చెరువులు

మండలం	చెరువులు/సప్లై చానల్స్
నూజివీడు	23
ముసునూరు	16
చాట్రాయి	16 /2
ఆగిరిపల్లి	13

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం సత్వరమే చెల్లించాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్‌జీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం డిమాండ్ చేశారు. నూజివీడులో శనివారం నిర్వహించిన ఎస్‌జీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సభ్యులు పాల్గొన్నారు.

రేపు చంద్రుపట్లలో గ్రామ సభ

విస్సన్నపేట: మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి శనివారం తెలిపారు. ఈనెల 21న చంద్రుపట్ల గ్రామ సచివాలయం వద్ద, 23న కొర్లమండ గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రీ సర్వేలో సమస్యలపై రైతులు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ఇతర ఆధార పత్రాలతో గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

ఆజాద్ కమిటీ నూజివీడు మహిళా అధ్యక్షురాలిగా రెహానా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆజాద్ ముస్లిం కమిటీ నూజివీడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా షేక్ రెహానా నియమితులయ్యారు. శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని ఆజాద్ కమిటీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ కమిటీ ద్వారా మైనార్టీ మహిళలకు అండగా నిలవాలన్నారు. ఆజాద్ కమిటీని అన్ని ప్రాంతాలకు విస్తరించి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమిటీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇమ్రాన్, మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ అబ్దుల్ ఆరిఫ్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఇబ్రహీంపట్నం: మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాములూరు నుంచి ఈలప్రోలు వరకు పది గ్రామ పంచాయతీల పరిధిలో 57 రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా త్వరలో రహదారుల నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. కేతనకొండలో ఎంపీటీసీ సభ్యుడు కొమ్మూరి రామకోటేశ్వరరావు ఎమ్మెల్యేను సత్కరించారు. మరిన్ని నిధులతో గ్రామం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీఓ సునీతశర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ శాఖాధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో రిటైర్డ్ ఇంజినీర్ మహ్మద్ ఖలీల్ రెహ్మాన్ సమకూర్చిన బ్యాగులను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా పాల్గొన్నారు. మూలపాడు జెడ్పీ పాఠశాల ఎస్సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్ పాల్గొన్నారు.



కాచవరంలో రహదారి అభివృద్ధికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వసంత

బాల్య వివాహాల నిరోధంలో కార్యదర్శులదే కీలకపాత్ర

ఆర్డీఓ మొవిడి వాణి

నూజివీడు: బాల్య వివాహాలను నిరోధించడంలో గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఆర్డీఓ మొవిడి వాణి పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం-2006పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామస్తులతో సత్సంబంధాలు కలిగి ఉంటే గ్రామంలో ఎక్కడ బాల్య వివాహం జరుగుతున్నా వెంటనే తెలుస్తుందన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేసి బాలికల భవిష్యత్‌ను నాశనం చేసే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. బాల్య వివాహాల నిరోధంపై డివిజన్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుంటే వెంటనే పోలీసు అధికారులకు, ఆర్డీఓ, సీడీపీఓలకు సమాచారం అందించాలన్నారు. 112 నంబరుకు కూడా కాల్ చేసి తెలియజేయవచ్చని చెప్పారు. ఐసీడీఎస్ ఏలూరు ప్రాజెక్టు డైరెక్టర్ కేపీఎల్ పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టప్రకారం తీసుకునే చర్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ సూర్యచక్రవేణి, సీడీపీఓ ఎస్‌వై నూరాని, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వాణి

బంగారం తీసుకుని ప్రభావతే మోసం చేసింది

- 386 గ్రాముల బంగారం తీసుకుని రూ. 2 లక్షల రుణం ఇచ్చింది
- విలేకరుల సమావేశంలో బాధితుడు యోగేశ్వరరావు ఆరోపణ

నూజివీడు: బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ సస్పెండ్ అయిన దావులూరి ప్రభావతి చేతిలో తానే మోసపోయానని, తాను ఏమీ ఆమెను మోసం చేయలేదని నూజివీడు మండలం సీతారామపురానికి చెందిన కవులూరి యోగేశ్వరరావు అన్నారు. తనను యోగేశ్వరరావు మోసం చేశాడంటూ ప్రభావతి ఒక ఛానల్‌లో లైవ్ డిబేట్ ప్రసారం అయిన నేపథ్యంలో ఆయన శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. తనపై ప్రభావతి అనేక ఆరోపణలు చేశారని, వాస్తవానికి ఆమే తనను మోసం చేశారని, ఇందుకు సంబంధించిన అన్ని సాక్ష్యాలు తన దగ్గర ఉన్నాయన్నారు. వీటన్నింటిని లైవ్ డిబేట్ ప్రసారం చేసిన ఛానల్‌కు ఇచ్చానని చెప్పారు. 2010 నుంచి ఆమె ఒక్కొక్కరిని మోసం చేస్తూ వచ్చిందన్నారు. తన దగ్గర ఉన్న 386 గ్రాముల బంగారాన్ని తీసుకొని కేవలం తనకు రూ.2 లక్షలు రుణం మాత్రమే ఇచ్చిందని, ఆ తరువాత బ్యాంకులో ఉన్న బంగారం అంతా తీసుకొని 60 రోజుల పాటు కనపడకుండా ఎక్కడకు వెళ్లింది, ఎవరి దగ్గర ఉందో చెప్పాలన్నారు. వాళ్ల నాన్నతో 2018లో ఐపీ కూడా పెట్టించిందన్నారు. నా సంతకాలు ఫోర్జరీ చేసి బ్యాంకులో ఉన్న నా బంగారాన్ని ఎత్తుకుపోయిందని చెప్పారు. గత ప్రభుత్వంలో తనపైనే కేసు పెట్టిందన్నారు. ఈమె గత చరిత్ర ఏమిటో, మోసాలు ఏమిటో అందరూ తెలుసుకోవాలన్నారు. ప్రభావతిపై రాష్ట్రంలో ఎన్నో చీటింగ్ కేసులు ఉన్నాయని ఆరోపించారు. తాను చట్టానికి లోబడి ఉంటానని, ఏ అధికారి పిలిచినా వెళ్లి తన వద్ద ఉన్న ఆధారాలన్నీ సమర్పిస్తానన్నారు. ఆమె చెప్పే కల్లబొల్లి కబుర్లు ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆగిరిపల్లి: భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలోని వడ్లమానులో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. భూ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. గ్రామ సభల్లో భూ యజమానులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

- **తిరువూరు రూరల్:** తిరువూరు మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 21 నుంచి నవంబర్ ఒకటో తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ లక్ష్మి శనివారం తెలిపారు. 21న వాముకుంట్ల, 22న ఆంజనేయపురం, 23న చిట్టేల, 24న ముష్టికుంట్ల, 28న లక్ష్మీపురం, 29న పెద్దవరం, 30న కోకిలంపాడు, నవంబర్ ఒకటో తేదీన ఎర్రమాడు గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని వివరించారు.

గ్రామ సభకు 16 అర్జీలు

ముసునూరు: భూముల రీ సర్వేలో వచ్చిన వివిధ సమస్యలను గ్రామసభల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పురుషోత్తమ శర్మ అన్నారు. మండలంలోని కొర్లగుంటలో రీ సర్వే గ్రామ సభను సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. గ్రామంలో రీ సర్వే అనంతరం భూ సమస్యల పరిష్కారం కోసం 16 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ దీపిక, వీఆర్ఓ పద్మ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన దుకాణాల పరిశీలన



విస్సన్నపేట: రైతులు కొనుగోలు చేసే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని, ఎమ్మార్పీకే అమ్మకాలు జరపాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పలు ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను ఏఓ శనివారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు అమ్మకాల వివరాలు ఏఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షల నిమిత్తం నమూనా తీసి పరీక్ష కేంద్రానికి పంపారు.

సమస్యలు పరిష్కరించాలని సీఈకి వినతి



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు చీఫ్ ఇంజినీర్ నాగరాజుకు శనివారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షంషేర్ వలి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 14న పోస్ట్‌కార్డుల ఉద్యమం, 18, 19న నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అయినా యాజమాన్యం, ప్రభుత్వ పెద్దలలో స్పందన లేదన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయానికి విరాళం

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): గంగానమ్మ అమ్మ వారి ఆలయం అభివృద్ధికి భక్తురాలు జొన్నలగడ్డ రమాదేవి రూ.50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన ఆమె ప్రస్తుతం ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. 1921లో నిర్మించిన గంగానమ్మ ఆలయాన్ని రెండేళ్ల కిందట గ్రామస్తులు పునర్నిర్మించారు. దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చేపడుతున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

కొరియర్, పార్శిల్ సంస్థల ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్

నూజివీడు: పట్టణంలో కొరియర్, పార్శిల్ సర్వీస్ సంస్థల ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి టపాసులు, మత్తు పదార్థాలు రవాణా కాకుండా చూడాలని డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న కొరియర్, పార్శిల్ సంస్థల నిర్వాహకులతో స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కొందరు వ్యాపారులు పార్శిల్‌ల ద్వారా టపాసులు, బాణసంచా మందుగుండు సామాగ్రికు ఆర్డర్ ఇస్తున్నారని, ఈ విధానంలో వాటిని పంపించడం అత్యంత ప్రమాదకరమని చెప్పారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాణనష్టం, ఆస్తినష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. అలాంటి వాటిని మీరు అనుమతించొద్దని, పార్శిల్‌ల నుంచి మందుగుండు సామగ్రికి సంబంధించిన వాసన వచ్చినా, అనుమానం వచ్చినా వాటిని తెరిచి చూసి పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొరియర్ ప్యాక్‌ల ద్వారా ఇటీవలి కాలంలో గంజాయి, మార్ఫిన్, ఎండీఎంఏ వంటి మాదక ద్రవ్యాల రవాణా జరుగుతోందని, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. వీటి విషయంలో నిర్వాహకులు ఏమాత్రం అలసత్వంగా ఉండొద్దని, తమది కాదనే ధోరణిలో వ్యవహరించొద్దని చెప్పారు. సమావేశంలో పట్టణ సీఐ సత్యశ్రీనివాస్, నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ సత్యశ్రీనివాస్

హాకథాన్ ఈవెంట్స్‌తో సాంకేతిక ప్రావీణ్యత పరిశీలన

మైలవరం: విద్యార్థులు కొన్ని గంటల్లో వారి సాంకేతిక ప్రావీణ్యతను పరిశీలించుకునేందుకు హాకథాన్ ఈవెంట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని వెండర్ మేనేజర్ పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మెర్న్ ఫుల్ స్టాక్ టెక్నాలజీస్ అనే సాంకేతిక అంశంపై 24 గంటలు హాకథాన్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెర్న్‌ఫుల్ టెక్నాలజీస్ అనేది ప్రముఖ సాంకేతిక అంశాలలో ఉన్నత స్థానంలో ఉందన్నారు. దీనిలో ప్రముఖంగా నోడ్ జేఎస్, రియాక్ జేఎస్, ఎక్స్‌ప్రెస్ జేఎస్, మోన్‌గో డీబీ అంశాలు వెబ్ అప్లికేషన్ సమర్థవంతంగా డెవలప్ చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీటి ద్వారా ఎన్నో డైనమిక్ అప్లికేషన్స్ తయారు చేయవచ్చని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక ప్రావీణ్యత ఆధారంగా మాత్రమే ఈ రోజుల్లో ఐటీ కంపెనీలు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలు ఇస్తున్నాయన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి. వీరయ్య, డాటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఓ.రమాదేవి, ఈవెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వై. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు విద్యార్థి ఎంపిక

తిరువూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-17 చెస్ పోటీలకు తిరువూరు బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి షేక్ సమీనా ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ రాజు శనివారం తెలిపారు. ఈనెల 18న ఎన్టీఆర్ జిల్లా నున్న హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సమీనా ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. సమీనాను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయిని సుకన్యను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రమణక్కపేట-హైదరాబాద్ బస్సు సర్వీసు

ముసునూరు: రమణక్కపేట నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు బస్సు సర్వీసు ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి ఎంపీపీ కొండా దుర్గాభవాని దంపతులు ఈ సర్వీసును లాంఛనంగా ప్రారంభించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రోజూ రాత్రి తొమ్మిది గంటలకు ఈ బస్సు నూజివీడులో బయలుదేరి రమణక్కపేటకు వచ్చి, 9.30 గంటలకు లీలానగర్, విస్సన్నపేట, తిరువూరు మీదుగా బీహెచ్ఈఎల్ చేరుతుందన్నారు.

వాహనం కొనుగోలుకు రూ.లక్ష వితరణ

తిరువూరు: తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్గపురికి పార్థీవ దేహాల తరలింపునకు అవసరమైన వాహనం కొనుగోలుకు శనివారం దాత రూ.లక్ష వితరణగా అందజేశారు. ఆకుల లలితాంబ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఆకుల వెంకట సురేష్‌బాబు ఈ మొత్తాన్ని తోసా కమిటీ సభ్యులకు వారి బంధువు ఆకుల వెంకటేశ్వరరావు ద్వారా అందజేశారు. తోసా సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 15 మందికి ఉద్యోగాలు



కేతనకొండ(ఇబ్రహీం పట్నం): ఆర్కే ఇంజినీ రింగ్ కళాశాల విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ శనివారం జరిగాయి. ఇంజినీరింగ్ ఫైనల్ ఇయ ర్ విద్యార్థులకు వశిష్ట సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థ (బెంగళూరు) హెచ్ఆర్ మేనేజర్లు గ్రూప్ డిస్క షన్స్, టెక్నికల్ ఇంటర్వ్యూ నిర్వహించారు. 45 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా 15 మందిని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ కాండ్రగుంట రామకృష్ణయ్య తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారని చెప్పారు. వీరు వచ్చే ఏడాది మార్చిలో ఉద్యోగాల్లో జాయిన్ అవుతారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మద్దులూరి మాలకొండయ్య,కార్యదర్శి మహేంద్రనాథ్, కోశాధికారి అమర్‌నాథ్, వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్, ప్లేస్‌మెంట్ అధికారి నరేంద్ర అభినందించారు.